14012024-DIS-08_Layout 1 1/14/2024 2:54 AM Page 1




చె లి మె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

# అణగారిన అడవి బిడ్డల గొంతుక

ఇప్పుడు మణిపూర్‌లో జరుగుతున్న గిరిజన జాతుల పోరాటమైనా, ఆనాడు ఉమ్మడి ఆదిలాబాద్‌లో జరిగిన గిరిజనుల అంతర్గత రిజర్వేషన్ పోరాటమైనా, ఇంద్రవెల్లి, వాకపల్లి వంటి ఘటనలైనా.. అవి కొంతకాలం తర్వాత పరిష్కారం దొరకని యధార్థ కథలుగా మిగిలిపోవడం షరా మామూలే! వాటిని వివరించే రచయితలకు అవి కథావస్తువులుగా మారుతున్నాయి. తప్ప వారి జీవితాలకు స్వేచ్ఛా, స్వాతంత్ర్యం లభించడం లేదు. 'అడవిని చూడండి. జలజల పారే సెలయేళ్లు, మెరిసే ఎండ, చెంగుచెంగున గంతేసే కృష్ణ జింకలను చూడండి. సెలయేళ్లు, వాగులు, వంకలు, చెలిమల దగ్గర పల్లెతల్లులు పిల్లల్ని చంకనేసుకుని కుండల్లో నీరు పట్టుకోవడం, సూర్యుడు వంగి భూమిని చూస్తుండటం వంటి దృశ్యాలు ఇంపుగా ఉంటాయి. రైతులు పొలాలు దున్నుతున్నప్పుడు అడవులే కాదు, కొండలు, గుట్టలు కూడా పచ్చదనంతో నవనవలాడుతున్నా బాగానే ఉంటాయి.

కానీ ఆ చిత్రాల వెనుక ఉండే కష్టాలు, కన్నీళ్లు మారవు. ఏమీ జరగదు! ఏమీ కాదు !! నువ్వు కలగననంతవరకు, కలగనడం ఎలాగో నీకు తెలియనంత వరకు అక్కడ ఏమీ జరగదు. అయితే రాజకీయ, పరిపాలన వ్యవస్థలు రిమోట్ కంట్రోల్‌తో నీతో కలలు కనిపించే నీ మెదడు జీవకణాల్ని నాశనం చేస్తూనే ఉంటాయి. అయితే కొన్ని కలలు తప్పించుకుని బయట పడతాయి. అట్లా తప్పించుకుని బయటపడ్డ కలల వెంట నేనెప్పుడూ పరుగెడుతుంటాను. ఈ మానవాళి సజీవంగా కొనసాగాలంటే కలలు గనే హక్కు తప్పకుండా ఉండాలి. కానీ పరిపాలన వ్యవస్థ కలలుగనే హక్కునే కూలగొడుతుంటే ఏమవుతుంది? వ్యక్తులు కూలిపోతారు. మొత్తంగా ప్రపంచమే కూలిపోతుంది. కలలు కనడమన్నది మనందరి సహజ హక్కు. దీన్ని మనం కాపాడుకోవాలి' అని ఎల్లవేళలా చెప్తుండేవారు సాహితీవేత్త మహాశ్వేతాదేవి. 1926, జనవరి 14న ప్రస్తుత బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని ఒక మధ్యతరగతి కుటుంబంలో, మనీష్ ఘటక్, ధరిత్రీదేవి దంపతులకు ఆమె జన్మించారు.


నేడు మహాశ్వేతాదేవి జయంతి



గుమ్మడి లక్ష్మీనారాయణ
94913 18409

'బహుశా 1980 నుంచి నేను సామాజిక పోరాటాన్ని ఉధృతం చేశాను. గొంతు విప్పాను. ఆదివాసీలు, గిరిజనులు, భూమిలేని గ్రామీణ పేదప్రజలు, కూలీలు, నగరాల్లో ఫుట్‌పాత్ జీవుల సమస్యలపై వారి పక్షాన నా దినచర్యగా ప్రతిస్పందించాను. భారతదేశంలో స్వాతంత్ర్యం ఎన్ని తప్పిదాలతో, ఎన్ని తప్పు నడకలతో ముందుకు వచ్చిందో విప్పి చెప్పగలిగాను. దేశంలో ప్రతి భాషలో ఇంకా పుస్తకాలు రావాలి. ముద్రితమవ్వాలి. అణగారిన ప్రజల జీవిత కథలు ప్రవహించాలి. ప్రతి ఒక్కరి చేతి వేళ్లు అక్షరాల కోసం అంగలార్చాలి. మూగబోయిన గొంతు విప్పాలి. గతంలోనైనా, ఇప్పుడైనా, భవిష్యత్తులోనైనా మనమంతా కలలు గనేది మానవీయ విలువల కోసమే' అంటూ 2006 అక్టోబర్ 21న మహాశ్వేతాదేవి జర్మనీ ఫ్రాంక్‌ఫర్ట్ బుక్ ఫెయిర్ ప్రారంభోత్సవ ప్రసంగంలో చెప్పారు. అంతిమంగా – కలలకు స్వాతంత్ర్యం కావాలి. రచయితల కలాలకు స్వేచ్ఛ కావాలి అని నిరంతరం చెప్తుండేవారు మహాశ్వేత.

మహాశ్వేతా దేవి రచనలు 90 శాతం గిరిజనుల జీవిత సంక్షోభాన్ని ఆవిష్కరించేవే. 1979లో సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికైన ఆమె చారిత్రక, కాల్పనిక రచన అరణ్యేర్ అధికార్ (ఎవరిదీ అడవి?) 19 వ శతాబ్దంలో బ్రిటిష్ పాలనపై జరిగిన ఆదివాసీ ముండా తిరుగుబాటుకు నాయకత్వం వహించిన గిరిజన నేత బిర్సాముండా జీవితాన్ని, పోరాటాన్ని వెల్లడించే రచన అది. 1899 –1900 మధ్యకాలంలో చోటానాగపూర్, రాంచీ ప్రాంతంలో జరిగిన గిరిజనోద్యమం (ఉల్గులాన్) ఆధారంగా రాసిన నవల ఎవరిదీ అడవి?. గిరిజనోద్యమమో, మరో ఘటనో జరిగిన ప్రదేశానికి వెళ్లకుండా రచనలు చేసినవారిలా కాకుండా, సంఘటన స్థలానికి వెళ్లి, ఆ మట్టితో మాట్లాడి, ఆ గాలిలో తిరగాడటమే మహాశ్వేతకు తెలిసిన అద్భుతమైన విద్య. భారతీయ గిరిజనోద్యమాల ఆత్మఘోష మొత్తం 'ఎవరిదీ అడవి?' నవల ద్వారా అవగతమవుతుంది.

మహాశ్వేత ఒక్కొక్క కథ గిరిజన జీవితంలోని ఒక విషాద పరిణామాన్ని వివరిస్తుంది. వ్యభిచార కూపాలలోకి బలవంతంగా కూరుకుపోతున్న వంగ ప్రాంత అటవీ బాలిక విషాద కథ 'శనిచరి'. ఇటుక బట్టీలలో పని పేరుతో తీసుకువెళ్లి ఆ బాలికలతో వ్యభిచారం చేయిస్తూ ఉంటారు దళారులు. అది భరించలేని ఎంతోమంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. శనిచరి మాత్రం కడుపున పుట్టిన బిడ్డతో సహా తిరిగి గ్రామంలోకి వచ్చి తనతప్పునకు అపరాధ రుసుము చెల్లిస్తుంది. ఐనా గిరిజన సమాజం ఆదరించదు. రైలు పట్టాల మీద బొగ్గు ముక్కలను ఏరుకుంటూ బతుకీడుస్తున్న దైన్యం. ఆ బొగ్గు ముక్కలే నిప్పురవ్వల్లాంటి ప్రశ్నలను సంధిస్తాయి. 'జీవిత ఖైదీ' కథలో మకర సవరలు అల్లకల్లోలమైన గిరిజన జీవితం కనిపిస్తుంది. ఇది సవర తెగలో పుట్టిన 'మకర' అనే గిరిజనుడి వైవాహిక సంఘర్షణ. పెళ్ళయిన చాలా కాలానికి కూడా అతని భార్యకు గర్భం కాకపోవడంతో ఆమె స్వయంగా విడాకులు కోరుకుంటుంది. నిస్సంతువుగా ఉండటం ఆ తెగలో నిషిద్ధం. గ్రామపెద్దలకు హఠాత్తుగా తెలుస్తుంది అసలు సంగతి. అతనికి పిల్లలు పుట్టకుండా , రహస్యంగా శస్త్రచికిత్స చేశారని! గిరిజన సాంప్రదాయాన్ని 1975 నాటి అత్యవసర పరిస్థితులలో జరిగిన బలవంతపు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు ఎలా సంక్షుభితం చేశాయో వర్ణించే కథ ఇది.

1997లో విశాఖపట్నం వచ్చిన మహాశ్వేత మన్యంలో గొప్ప మన్యసీమ ఉద్యమం నడిపిన అల్లూరి సీతారామరాజు జీవితం ఆధారంగా ఆయన శత జయంతి (1997) సందర్భంలో నవల రాస్తానని చెప్పారు. అలాగే విజయనగరం జిల్లా పాచిపెంట మండలం 'మూల వలస' సందర్శించి మన్యం వీరునిపై నవల రాస్తానని ప్రమాణం చేశారు. ఆమె తెలంగాణ ఆదివాసీ గిరిజన పోరాటాలపై విస్తృత సమాచారం సేకరించారు. నైజాం రజాకార్లపై తిరగబడ్డ ఘనచరిత్ర గల కుమ్రంభీం వంటి ఆదివాసీ పోరాట యోధుని గురించి ఆమె ఆరా తీశారు. అల్లూరి నవలా ప్రయత్నం నెరవేరితే తెలుగు ప్రాంతాల గిరిజనోద్యమాలపై మరింత వెలుగు ప్రసరించేది. 2007, ఆగష్టు 20 న జరిగిన వాకపల్లి దుర్ఘటనను అమానవీయ చర్యగా మహాశ్వేత చెప్పారు. అణగారిన వర్గాల గొంతుకగా తన కథా రచనలతో కేంద్ర సాహిత్య అకాడమీ(1979), జ్ఞానపీఠ్ (1996), రామన్ మెగసెసె (1997), పద్మభూషణ్ (2006) పురస్కారాలు అందుకున్న మహాశ్వేత 2016 జూలై 28న కోల్‌కతాలో కన్నుమూశారు. అటవీ సంరక్షణ, ఆదిమ జాతుల వారు రక్షితులుగా రాజ్యాంగ ఫలాలు అందిపుచ్చుకునేలా నేటి పాలకులు కొంతైనా చేయగలిగితే అదే మహాశ్వేతకు నిజమైన నివాళి!

వ్యాసకర్త: ఆదివాసీ రచయితల వేదిక వ్యవస్థాపక కార్యదర్శి




## ఒంటరి దుఃఖం

పాపకు జ్వరమొచ్చింది
ఆసుపత్రి పిలిచింది
భోరున అమ్మ ఏడ్వచ్చు..

నాన్నవు నువ్వేడువద్దు..

కొడుకుకు యాక్సిడెంటు..
చిన్న దెబ్బలే ..
అమ్మది లబోదిబో ఏడుపు

నాన్నవు నువ్వు ఏడువరాదు..

పిల్లలను దూర ప్రాంతంలోని
చదువులకు పంపడం
ఆపై విదేశాలకూ, ఉద్యోగాలకూ..
అమ్మ హాయిగా ఏడ్వచ్చు..

నాన్నవు నువ్వేడువకూడదు..

బిడ్డకు పెండ్లి చేసి
అత్తారింటికి సాగనంపినప్పుడు..
తల్లిది గుండలవిసేలా ఏడుపు

నాన్నవు నువ్వేడువనేవొద్దు...

నాన్న ఏడిస్తే బాగుండదు
నాన్న ఏడిస్తే.. ఒప్పుకోరు
నాన్న ఏడిస్తే.. ఆశ్చర్యపోతారు
నాన్న తన
ఏడుపు సముద్రాలను మింగి దిగమింగి
ఒంటరి నావలా బేలగా జీవన
తీరాల వైపు చూస్తూనే ఉంటాడు..
నాన్న.. తన గుండె పర్వత భారాలను
నిత్యం మోస్తూనే ఉంటాడు...

ఈ సముద్ర దుఃఖం
ఎవరూ చూడనిది,
ఈ కల్లోల భాష ఎవరూ చదువనిది!

ఎక్కడన్నా, ఎప్పుడన్నా సముద్రాన్ని చూస్తే
నాన్ననే గుర్తుకువస్తాడు!



డాక్టర్ కాసర్ల నరేశ్‌రావు
94414 06252

# భోగి మంటల వెనుక బోలెడు కథలు

పెద్ద పండుగగా జరుపుకునే మూడు రోజుల సంక్రాంతి పండుగలో మొదటి రోజును మనం భోగి పండుగగా జరుపుకుంటాం. దక్షిణాయనంలో సూర్యుడు రోజురోజుకి భూమికి దక్షిణం వైపుగా కొద్దికొద్దిగా దూరమవుతూ దక్షిణార్ధగోళంలో భూమికి దూరం అవడం వలన భూమిపై బాగా చలి పెరుగుతుంది. ఈ చలి వాతావరణాన్ని తట్టుకునేందుకు ప్రజలు సెగ కోసం భగభగ మండే చలిమంటలు వేసుకుంటారు.

అంతేకాకుండా దక్షిణాయనంలో ప్రజలు తాము పడిన కష్టాలను, బాధలను అగ్నిదేవుడికి ఆహుతి చేస్తూ, రాబోయే ఉత్తరాయణంలో సుఖసంతోషాలను ఇమ్మని కోరుతూ వేసే మంటలు భోగి మంటలు అంటారని మనకు తెలిసిందే. మరైతే ఈ పండుగ రోజున భోగి మంటలు ఎందుకు వేస్తారో వాటి పురాణం మరియు శాస్త్రీయ కారణాలు తెలుసుకుందాం.



'భుగ్' అనే సంస్కృత పదం నుండి భోగి అనే పదం వచ్చింది. భోగం అంటే సుఖం. పూర్వం ఈ దినమే శ్రీ రంగనాథస్వామిలో గోదాదేవి లీనమై భోగాన్ని పొందిందని, దీని సంకేతంగా భోగి పండగ ఆచరణలోకి వచ్చిందనేది పురాణగాథ. శ్రీ మహావిష్ణువు వామన అవతారంలో బలి చక్రవర్తిని పాతాళంలోకి తొక్కిన పురాణగాథ కూడా ఉంది. అయితే తరువాత బలి చక్రవర్తిని పాతాళరాజుగా ఉండమని, ప్రతి సంక్రాంతికి ముందు రోజున పాతాళం నుండి భూలోకానికి వచ్చి ప్రజల్ని ఆశీర్వదించమని వరమివ్వడం జరిగిందట. బలిచక్రవర్తి రాకను ఆహ్వానించడానికి భోగి మంటలు వేస్తారని మన పురాణాల్లో చెప్పబడింది. కృష్ణుడు ఇంద్రుడికి గుణపాఠం చెప్పేందుకు గోవర్ధన పర్వతం ఎత్తిన పవిత్రమైన రోజూ ఇదే. శాపవశంగా పరమేశ్వరుని వాహనమయిన బసవన్న రైతన్నకు అండదండగా నిలిచేందుకు భూమికి దిగి వచ్చిన రోజు ఇదేనని మరో గాథ.

సాధారణంగా అందరూ చెప్పేది, ఇది చలికాలం కనుక వెచ్చదనం కోసం మంటలు వేస్తారని. కానీ నిజానికి భోగి మంటలు వెచ్చదనం కోసం మాత్రమే కాదు, ఆరోగ్యం కోసం కూడా. ధనుర్మాసం నెలంతా ఇంటిముందు పెట్టిన గొబ్బెమ్మలను పిడకలుగా చేస్తారు. వాటినే ఈ భోగి మంటలలో వాడుతారు. దేశీ ఆవు పేడ పిడకలని కాల్చడం వలన గాలి శుద్ధి అవుతుంది. సూక్ష్మక్రిములు నశిస్తాయి. ప్రాణవాయువు గాలిలోకి అధికంగా విడుదల అవుతుంది. ఆ గాలి పీల్చడం ఆరోగ్యానికి మంచిది. చలికాలంలో అనేక వ్యాధులు వ్యాపిస్తుంటాయి. ముఖ్యంగా శ్వాసకు సంబంధించిన అనేక రోగాలు పట్టి పీడిస్తాయి. వాటికి ఔషధంగా ఇది పని చేస్తుంది. భోగి మంటలు పెద్దవిగా రావడానికి అందులో రావి, మామిడి, మేడి మొదలైన ఔషధ చెట్ల బెరడులు వేస్తారు. అవి కాలడానికి ఆవు నెయ్యిని వేస్తారు. అగ్నిహోత్రంలో వేయబడిన ప్రతి 10 గ్రాముల దేశి ఆవు నెయ్యి నుంచి బోలెడు ప్రాణవాయువు విడుదల అవుతుందట. ఈ ఔషధ మూలికలు ఆవు నెయ్యి, ఆవు పిడకలని కలిపి కాల్చడం వలన విడుదల అయ్యే పొగ అతి శక్తివంతమైంది. మన శరీరం నాడులలోకి ప్రవేశించి శరీరాన్ని శుభ్ర పరుస్తుంది. ఒకరికి రోగం వస్తే దానికి తగిన ఔషధం ఇవ్వవచ్చు. అదే అందరికీ వస్తే ఔషధం సమకూర్చడం దాదాపు అసాధ్యం. ఇదంతా ఆలోచించిన మన పెద్దలు భోగి మంటల సంప్రదాయాన్ని తెచ్చారు. దాని నుండి వచ్చే పొగ అందరికి ఆరోగ్యాన్ని ఇస్తుంది. కులాలకు అతీతంగా అందరూ ఒక చోట చేరడం వల్ల ప్రజల మధ్య దూరాలు తగ్గుతాయి. ఇది ఒకరకంగా అగ్నిదేవుడి ఆరాధనా, మరోరకంగా గాలిని శుద్ధి చేస్తూ వాయుదేవునికి ఇచ్చే గౌరవం కూడా.

కాని ఈ రోజుల్లో కొందరు రబ్బరు టైర్లను పెట్రోలు పోసి తగులబెట్టి భోగిమంటలు అంటున్నారు. కానీ దీనివల్ల విష వాయువులను పీలుస్తూ, కాలుష్యాన్ని ఎగదోస్తూ మన ఆరోగ్యాన్ని పాడుచేసుకోవడమే అవుతుంది. ఇక భోగి మంటల్లో పనికిరాని వస్తువులను వేసి కాల్చాలి అంటుంటారు. పనికిరాని వస్తువులు అంటే ఇంట్లో ఉండే ప్లాస్టిక్ కవర్లు, వైర్లు లాంటివి కావు అని తెలుసుకోవాలి. నిజానికి భోగి మంటల్లో కాల్చాల్సింది పాత వస్తువులని కాదు, మనలోని పనికి రాని అలవాట్లు, చెడు లక్షణాలు. అప్పుడే మన కున్న పీడలు పోయి మానసిక ఆరోగ్యం, విజయాలు వస్తాయి.



రావుల రాజేశం
98488 11424
తెలంగాణ సామాజిక రచయితల సంఘం
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి...కరీంనగర్ జిల్లా

## సందువోకుండ ముగ్గులేసి

సంకురాతిరి పండగంటే మా తెలంగాణల సకినాల పండగే...
కంచుడువెట్టని కడపే ఉండది...
ఊళ్లె రోజుకో ఇల్లని వంతు వెట్టుకొని సీకట్లనే బియ్యం నానవెడితే...
తెల్లారంగ గిర్ని కాడ నిలవడి నిలవడి పిండి పట్టిచ్చుకచ్చేటోల్లు...
అమ్మమ్మ మా వాడకున్న నలుగుర్ని సకినాలు సుట్ట రమ్మని...
ఉతికిన రెండు పాత శెద్దర్లు పర్శి నడివిట్ల గౌరమ్మను వెడితే...
అందరు ఒక్కతీరు సకినాలు సుడుదురు...
తాతకి సకినాలు దంగయని మెత్తగ బెల్లపరిసెలు చేసి సాటుకు తనబ్బిల ఒరగవెట్టేది...
పండుగకు రెండొద్దుల ముందుగాల్నే ఆకిట్ల ముగ్గేయ బియ్యప్పిండి పట్టిచ్చి...
బోగినాడు మబ్బుల మూడింటికే లేశి కొట్టంల పెండ తెచ్చి గుంజపొంట పెట్టేది..
ఆకిలంత ఊడ్చల్లి సందువోకుండా గిర్క వట్టి ముగ్గేసుకత్తే...
అవ్వగారింటికచ్చిన ఆడిబిడ్డ పీటేసి గొబ్బెమ్మలు చేసి పసుపు కుంకుమ పుదిచ్చేది..
పెరట్ల గర్కపోసలు, బంతి పూలు కోస్కచ్చి...
సోలల వడ్లు, రేగువండ్లు, మక్కిత్తులు, జొన్నలు, చిక్కులు, కలిపి...
ముగ్గుముగ్గుల గౌరమ్మలు పెట్టీ
నవధాన్యాలు పోసుకద్దురు..
సెవ్వుల్ల నూనెబొట్టేసుకొని తలకువోస్కాని...
అర్రలికి ఏళ్ల ముగ్గేసి ఇంటి దేవుడికి దీపం పెట్టీ..
పొయ్యికాడ ఎచ్చగా కూకొని
పులుగన్నం, పచ్చిపులుసు అండుతాంటే...



సన్నాయి సప్పుల్లతో గంగిరెద్దు బసవన్నలచ్చి పందిరికింద ఆటలాడితే...
మనువలు, మనవరాండ్లు ఎగురుకుంట తాత సుట్టు సంబురంగ తిరుగుదురు...
పట్నం నుండచ్చిన పాలోల్లందరు ఒకరింటికి ఒకలువోయి కట్టసుఖాలు
మాట్లాడుకునుడే..
మా సంకురాతిరి పండుగ...
పండుగంటే కొత్త బట్టలేసుకునుడే కాదు..
కండ్లనీళ్లు తీసుడు...
బిడ్డ బస్సెక్కేదాకా కడుపులవెట్టుకొని సూసుకొనుడు...
సకినాల సంచిచ్చి సాగనంపుడు...



తుమ్మల కల్పన రెడ్డి
96404 62142




## వొడుకుడు పీట

నీళ్లేసిన గొర్లను కత్తిరించి
ఇంటికి తీసుకొచ్చిన ఉన్ని మూటలు
వొడుకుడు పీట మీద నాయినమ్మ
కదుర్లకు సుట్టుకున్నట్లు
పాల దంతాలొచ్చిన నా అక్షరాలు
పాతింటి కబుర్లను గుర్తు చేసుకుంటున్నాయి...

కండెలు కండెలుగా ఉన్ని వొడుకుతూ
నాయినమ్మతో మా అమ్మ పోటీ పడేది
టెంకాయ చిప్పలు గిరగిరా తిరుగుతుంటే
కదుర్లు పరుగు పందెంలో పాల్గొన్నట్టుగా ఉండేది...

పాతింటి ముందు ఎడ్ల కొట్టానికి
తాటికమ్మలు కోసిన కొడవళ్లు
సపారంలో సూరుకు చెక్కిన సూల్కందబ్బ వలె
పని కోసం ఎదురుచూస్తున్నాయి
ఇనుప సామానులో కలిసిపోయి వింత వస్తువులుగా...

మెట్లెక్కి బాల్కనీ మీదికి నడుస్తుంటే
మట్టి మిద్దె ఎక్కడానికి ఆసరైన వెదురు నిచ్చెన
కొడుపులు వదులై తుప్పపట్టిన ఇనుములాగా కనిపిస్తుంది
ఈత సాప మీద పడుకున్న నాయినమ్మల కాలం
ప్రతి ఇంట్లో ప్లాస్టిక్ సాపలకు ఒరవడి దిద్దినట్టుంది
దర్వాజ సుంచు మీద కదుర్లు మళ్లీ
వొడుకుడు పీట కోసం ఎదురుచూస్తున్నట్టుంది...

ఎజ్జు మల్లయ్య
96528 71915



ప్రకటన

### కథా సంపుటి ఆవిష్కరణ సభ

హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్ వేదికగా 2024 జనవరి 18న గురువారం సాయంత్రం 6 గంటలకు విజయ భండారు రచించిన 'విభజిత' కథా సంపుటి ఆవిష్కరణ సభ జరుగనున్నది. ఓల్గా అధ్యక్షతన, శీలా సుభద్రా దేవి ఆవిష్కర్తగా వ్యవహరిస్తారు. డా.మామిడి హరికృష్ణ ముఖ్యఅతిథిగా రానున్నారు. వి.సంధ్య, మానస ఎండ్లూరి, డా.నందిగాం నిర్మల వక్తలుగా పాల్గొంటారు.